సాక్షి
విశాఖపట్నం
శనివారం । 8 । జూన్ । 2024


చిత్రకళ.. అదిరేలా.. 8లో


కొత్త ప్రపంచం..
బంగారు జీవితం 8లో

న్యూస్‌రీల్

రాంగ్ పార్కింగ్ వాహనాలకు వీల్ లాక్


మద్దిలపాలెం కూడలి వద్ద రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు లాక్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం : నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం చర్యలకు దిగారు. అక్కడికక్కడే వాహనాలకు వీల్ లాక్ వేసే ప్రక్రియను ప్రారంభించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌కు ఎదురుగా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన భారీగా పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్ లాక్‌లు వేశారు. అనంతరం ఆయా వాహనాల యజమానుల నుంచి జరిమానా వసూలు చేశారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలిపితే ఇదే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. షాపింగ్ కాంప్లెక్స్ వద్ద వాహనాలను షెల్లార్‌లో పార్క్ చేయాలని, ఆయా షాపుల యజమానులు దీనిపై దృష్టి సారించాలని కోరారు.

మీ సేవలు నిరుపమానం


గన్‌మెన్లను సత్కరించిన వాసుపల్లి

దాబాగార్డెన్స్: తనను 24 గంటలూ కంటికి రెప్పలా చూసుకున్న గన్‌మెన్ల సేవలు నిరుపమానమని మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. 104 ఏరియాలో గల వాసుపల్లి కార్యాలయంలో గన్‌మేన్లు అప్పలనాయుడు, బుల్లి నాయుడ్ని శుక్రవారం ఘనంగా సత్కరించారు. వాసుపల్లి గణేష్‌కుమార్‌ను వీడి వెళ్లడంపై వారు కన్నీటి పర్యంతమయ్యారు.

వినియోగదారుడికి న్యాయం


వినియోగదారుడికి బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న దృశ్యం

గాజువాక : ఏపీ కన్జ్యూమర్ రైట్స్ సంస్థ కృషితో గాజువాకలోని ఒక జ్యూయలరీ సంస్థ స్కీమ్ సభ్యుడికి న్యాయం జరిగింది. కన్జ్యూమర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి దొడ్డి సన్నిబాబు గాజువాకలోని ఒక జ్యూయలరీ షోరూమ్‌లో గోల్డ్ స్కీమ్‌లో చేరారు. స్కీమ్‌లో మొత్తం నగదు చెల్లించినప్పటికీ ఆ నగదుకు బంగారం ఇవ్వకుండా తమ షోరూమ్ చుట్టూ తిప్పించుకున్నారు. దీంతో విసిగిపోయిన ఉద్యోగి కన్జ్యూమర్ రైట్స్ సంస్థను ఆశ్రయించాడు. ఆ సంస్థ అధ్యక్షుడు జ్యూయలరీ సంస్థ యాజమాన్యానికి నోటీసులు పంపించడంతో స్పందించిన యాజమాన్యం సంబంధిత వ్యక్తికి నగదుకు సరిపడా బంగారాన్ని అందజేసినట్టు నాగేశ్వరరావు తెలిపారు. వినియోగాదారులు ఆకర్షణీయమైన ప్రకటనలను చూసి మోసపోవద్దని, నిబంధనలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

పలు రైళ్ల రీషెడ్యూల్



తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యంతో పలు స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్ (12829) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు, చెన్నై ఎగ్మోర్–సంబల్‌పూర్ (06109) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు, ఎస్ఎంవీటీ బెంగళూరు– హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు, లోకమాన్య తిలక్ టెర్మినస్–భువనేశ్వర్ (08419) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 6 గంటలు ఆలస్యంగా రాత్రి 7.30 గంటలకు బయలుదేరింది.

మంత్రులుగా అనిత, పల్లాకు చాన్స్!

- జనసేన నుంచి కొణతాలకు అవకాశం
- గంటా, అయ్యన్నలకు మొండిచేయి
- ఇప్పటికే సంకేతాలు పంపిన చంద్రబాబు
- పదవి కోసం పైరవీలు ప్రారంభించిన మరికొందరు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉమ్మడి విశాఖ జిల్లాలో అమాత్య యోగం సీనియర్లకు దక్కే సూచనలు కనిపించడం లేదు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో తమకు మంత్రి పదవి దక్కుతుందనే ఆశతో ఎదురు చూస్తున్న సీనియర్లకు నిరాశే ఎదురుకానున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఎస్సీ, బీసీ కోటాలో ఇద్దరికి అవకాశం కల్పించాలని టీడీపీ అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చింది. ఎస్సీ కోటాలో పాయకరావు పేట నియోజకవర్గం నుంచి గెలుపొందిన అనితతో పాటు గాజువాక నియోజకవర్గం నుంచి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావులకు బీసీ (యాదవ) కోటాలో మంత్రి హోదా దక్కనున్నట్టు తెలుగుదేశం పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే వీరిద్దరికీ కూడా సమాచారం అందినట్టు ఈ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, అయ్యన్న మాత్రం పట్టువదలకుండా తనకు మంత్రి





పదవి కావాల్సిందేనని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మొత్తంగా మంత్రి పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో భారీగా పోటీ నెలకొంది. ఇక జనసేన తరపున అనకాపల్లి నుంచి గెలుపొందిన కొణతాల రామకృష్ణ పోటీలో ప్రాధాన్యత క్రమంలో ముందు వరుసలో ఉన్నారు. ఇక బీజేపీ నుంచి విష్ణుకుమార్ రాజు ఆశిస్తున్నారు. అయితే ఆయనకు కష్టమేనని తెలుస్తోంది.

సీనియర్లను పక్కన పెట్టి...

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీగా సీట్లను సాధించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏజెన్సీ నుంచి మినహా మిగిలిన పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించింది. దీంతో మంత్రి పదవుల కోసం భారీగా పోటీ నెలకొని ఉంది. అయితే ఈ సారి మంత్రి వర్గంలో తన మార్క్ స్పష్టంగా కనిపించేందుకు వీలుగా పూర్తిస్థాయిలో సీనియర్లను పక్కన పెట్టే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సీనియర్లగా ఉన్న గంటా శ్రీనివాసరావు, అయ్యన్న, బండారులను పరిగణనలోనికి తీసుకునే అవకాశం లేదని సమాచారం. ఇందులో బండారు, గంటాలకు సీటు కేటాయించే సమయంలోనే మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదని పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అయ్యన్నకు మాత్రం కచ్చితంగా మంత్రి పదవి ఇస్తారనే ప్రచారం పార్టీలో జరుగుతోంది. అయితే సీనియర్లను పక్కన పెట్టే ఉద్దేశంతో శ్రీకాకుళంలో కూడా అచ్చెన్నాయుడుకు ఇవ్వడం లేదని సమాచారం. ఇదే కోవలో ఇక్కడ కూడా అయ్యన్న పాత్రుడిని పరిగణనలోనికి తీసుకోవడం లేదని పార్టీలో అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో కాకుండా మరో విధంగా గౌరవం కల్పిస్తానని అయ్యన్నను బుజ్జగించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా సీనియర్లను పక్కన పెట్టి తన మార్క్ పూర్తిస్థాయిలో ఉండే విధంగా చంద్రబాబు వ్యవహరించనున్నట్టు మాత్రం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

జనసేనలోనూ పోటా పోటీ...

జనసేన నుంచి కూడా మంత్రి పదవుల కోసం పోటీ నెలకొని ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యేలుగా గెలిచిన కొణతాలతో పాటు పంచకర్ల, సుందరపు విజయ్‌కుమార్, వంశీకృష్ణలు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నారు. ఇప్పటికే యాదవ సామాజికవర్గం నుంచి పల్లాకు బెర్తు ఉండటంతో వంశీకృష్ణకు ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోవైపు మొదటిసారిగా గెలిచిన సుందరపు విజయ్‌కుమార్‌కు కూడా కష్టమేనని సమాచారం. ప్రధానంగా కొణతాలతో పాటు పంచకర్ల రమేష్‌బాబుల మధ్య పోటీ ఉంది. అయితే గవర సామాజికవర్గానికి చెందిన కొణతాల వైపే పవన్ మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. కాపు కోటాలో పంచకర్ల కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు ఎవరికి యోగం వరించనుందో మరో రెండు, మూడు రోజుల్లో తేలనుంది. మొత్తంగా అధికారపక్షంలో అమాత్యుల కోసం భారీగా పోటీ నెలకొని... ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమై ఉన్నారు.

13న ఉక్కు కార్మికులకు జీతాల చెల్లింపు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు 13న జీతాల **చెల్లించనున్నారు. కార్మి**క సంఘాలకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ తెలిపారని కార్మిక నాయకులు చెప్పారు. శుక్రవారం ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన సమావేశంలో నాయకులు జీతాల చెల్లింపు గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతల్లో కీలక పాత్ర వహిస్తున్న ఉద్యోగుల జీతాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యవైఖరి కూడదన్నారు. జీఎస్టీ, విద్యుత్ బిల్లులు, ముడి పదార్థాల చెల్లింపునకు ఇచ్చే ప్రాధాన్యత జీతాల చెల్లింపునకు ఇవ్వరా అని ప్రశ్నించారు. ఈనెల కార్మికులు తమ పిల్లలకు ఫీజులు కట్టాల్సి ఉన్నందున 10 నాటికి జీతాలు చెల్లించాలని కోరారు. దీనిపై సీఎండీ మాట్లాడుతూ మిగతా చెల్లింపులు ఉన్నందున 13న జీతాలు ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు శ్రామిక సంఘం ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ నాలుగు నెలలుగా నిర్వాసిత కార్మికులకు జీతాలు అందడం లేదని సీఎండీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.టి. దాస్, బొడ్డు పైడిరాజు, సన్యాసిరావు, నరేంద్ర, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌ను ఎంతో మెరుగుపరిచాం

- మరికొన్ని ఇతర ఆస్పత్రులకు రూ.18.23 కోట్ల వ్యయం
- బర్న్స్ వార్డుకు త్వరలో మరో రూ.2 కోట్లు
- ఎన్నికల్లో మీడియా సహకారం భేష్
- జర్నలిస్టు దంపతులకు ఫ్రీ హెల్త్ చెకప్‌లు
- హెల్త్ కార్డుల ప్రీమియం కూడా చెల్లింపు
- మీడియాతో ఆత్మీయ భేటీలో కలెక్టర్ మల్లికార్జున


మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ రవిశంకర్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయని కేజీహెచ్‌ను ఎంతో మెరుగుపరిచామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. దీంతోపాటు విక్టోరియా, చెస్ట్, ఆర్సీడీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రులను మరింతగా అభివృద్ధి చేయడానికి రూ.18.23 కోట్ల సీఎస్సార్ నిధులు వెచ్చించామన్నారు. త్వరలో కేజీహెచ్ బర్న్స్ వార్డుకు మరో రూ.2 కోట్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో రూ.10.82 కోట్లతో ప్రభుత్వ వసతి గృహాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ఇంకా జిల్లాకు ఆదాయం సమకూరే చర్యల్లో భాగంగా నాలుగు పెట్రోలియం ఔట్‌లెట్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. సార్వత్రిక ఎన్నికల ముగిసిన నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో యంత్రాంగానికి జర్నలిస్టులు ఎంతో సహకరించారని కొనియాడారు. మీడియా కథనాలతో యంత్రాంగం పొరపాట్లను సరిచేసుకునే వీలు కలిగిందని, ఇందుకు జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. సమాజానికి ఎన్నో విధాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరపున చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలువురు జర్నలిస్టులకు హెల్త్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించామని, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. జులై ఒకటో తేదీ నుంచి అపోలో ఆస్పత్రి ద్వారా జర్నలిస్టుతో పాటు జీవిత భాగస్వామికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు చేయించాలని నిర్ణయించామని వెల్లడించారు. అలాగే ఆగస్టు నుంచి జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రీమియం రెన్యూవల్ కూడా ఉచితంగా చేయిస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని, కొత్త ప్రభుత్వ విధానాలకనుగుణంగా ఈ ప్రకియకు సంబంధించి కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తామని తెలిపారు. సంజీవని నిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సాయం అందించామని గుర్తు చేశారు. జర్నలిస్టులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు.

మీడియాది ప్రశంసనీయ పాత్ర

సార్వత్రిక ఎన్నికల్లో మీడియా ప్రశంసనీయ పాత్ర పోషించిందని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మీడియా పలు కథనాలు ప్రచురించిందని, యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందని గుర్తు చేశారు. జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై అన్ని వర్గాల నుంచి ప్రసంశలు లభించాయని, పోలీస్ శాఖ నుంచి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టామని, శాంతిభద్రతలను పరిరక్షించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శేష శైలజ, అఖిల, సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ జాతరను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత, చిత్రంలో ఎస్పీ తుహిన్‌సిన్హా తదితరులు


హాజరైన అధికారులు, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు

- కలెక్టర్ విజయ సునీత
- అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం

సాక్షి, పాడేరు: ఈనెల 9,10.11తేదీల్లో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె అధికారులు,ఉత్సవ కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. అధికారులు,ఉత్సవ కమిటీ ప్రతినిధులంతా సమన్వయంతో పనిచేసి జాతరను ఘనంగా నిర్వహించాలని కోరారు. క్లోరినేషన్ చేసిన తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజలకు పంపిణీ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వంట గ్యాస్‌ను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు.అదనపు కార్మికులను నియమించి పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు.రవాణా సమస్య తలెత్తకుండా అదనంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఘాట్‌రోడ్డులో భారీ వాహనాలను నిషేధించామని తెలిపారు. ఇందుకు తగ్గట్టుగా పోలీసు,ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ వాహనాలు ఓవర్‌లోడ్‌తో సర్వీసు చేయకుండా నియంత్రించాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో 750 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మోదకొండమ్మతల్లి ఆలయం, సతకంపట్టుతో పాటు ప్రధాన జంక్షన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, కంట్రోల్ రూమ్,సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ విశాఖ నుంచి వచ్చే వాహనాలను మండల పరిషత్ కార్యాలయ సమీపంలో, చింతపల్లి నుంచి వచ్చే వాహనాలను సెయింటాన్స్ కాన్వెంట్ వద్ద, అరకులోయ,పెదబయలు నుంచి వచ్చే వాహనాలను తలారిసింగి పాఠశాల సమీపంలో పార్కింగ్‌కు ఏర్పాటుచేశామన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీడీ కొండలరావు,ఆర్‌డబ్ల్యూఎస్,ఆర్అండ్‌బీ ఈఈలు లీలాకృష్ణ,బాలసుందరబాబు, డీఎల్పీవో కుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, కె.వెంకటరమణ, వై.శ్రీను.టి.ప్రసాద నాయుడు పాల్గొన్నారు.

భార్య హంతకుడికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: భార్యను అతికిరాతకంగా హత్య చేసిన నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని మహిళా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడాది పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. నిందితుడు నీలాపు పోలారాజు మహా నగర పాలకసంస్థలో పీహెచ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మృతురాలు రత్నం(30) 2015కి ముందు గాంధీ అని వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు కుటుంబ కలహాల కారణంగా విడిపోయారు. అనంతరం రత్నం పోలరాజును వివాహం చేసుకుంది. వివాహ సమయంలో రత్నం కట్నం కింద రూ 1.7 లక్షలు విలువ చేసే తాటాకు ఇంటిని ఇచ్చింది. అదనంగా బంగారం, ఇతర సామగ్రి కూడా అందజేసింది. వీరు కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జ్ఞానాపురం కొండమీద కాపురం ఉండేవారు. కొంతకాలం సవ్యంగా సాగిన వీరి కాపురంలో అలజడి మొదలైంది. భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. 2015 మే 17న భార్యాభర్తలిద్దరూ గొడవ పడగా.. ఉదయం 8.30 గంటల సమయంలో నిందితుడు పోలరాజు రత్నంపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. శరీరం మొత్తం మంటలు వ్యాపించడంతో కాలిన శరీరంతో ఆమె కొట్టుమిట్టాడుతోంది. ఆ సమయంలో సమీపంలోని రమణ అనే వ్యక్తి పరిస్థితి చూసి రత్నంను కేజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 6.30 గంటలకు ఆమె కన్ను మూసింది. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ రఘువీర్ విష్ణు కేసును దర్యాప్తు చేసి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 302, 498ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

జిల్లా రిసోర్స్ పర్సన్లకు ముగిసిన వృత్యంతర శిక్షణ


మాట్లాడుతున్న ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయభాస్కర్

సీతంపేట: నూతన విద్యా సంస్కరణ (ఎన్ఈపీ–2020)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా శాఖలో జరుగుతున్న పునాది అక్షరాస్యత సంఖ్యాశాస్త్రంలో జిల్లా రిసోర్స్ పర్సన్లకు రెండు రోజుల వృత్యంతర శిక్షణ తరగతులు స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం ముగిశాయి. ఈ శిక్షణా కార్యక్రమం సాల్ట్ సమగ్ర శిక్షణా, విశాఖపట్నం అధ్వర్యంలో ఏర్పాటు చెశారు. జిల్లాలోని 11 మండలాల రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. గత సంవత్సరంలో జరిగిన జ్ఞాన ప్రకాష్‌లోని అంశాలను పునశ్చరణ జరుపుతూ నూతన మదింపు ముల్యాంకనం, ఏజ్ ఏప్రిప్రియేట్ టూల్ అనే మదింపు విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం ముగింపు సమావేశంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పాఠశాల విద్యా విశాఖపట్నం జోన్–1 విజయభాస్కర్ , జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్.చంద్రకళ, అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు 1, 2 రామారావు, బాలామణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణలో ముఖ్యంగా 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు ఆటపాటలతో చిన్నారులను ఆకట్టుకోవాలని తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారిణి చంద్రకళ, అదనపు పథక సమన్వయకర్త బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణలోని కరదీపిక, మూల్యాంకన కిట్, దాని వినియోగం, నిర్వహణ జాగ్రత్తగా తెలుసుకుని పాఠశాలలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కోర్సు కోఆర్డినేటర్‌గా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారిణి జి.లక్ష్మి, కీ రిసోర్స్ పర్సన్లుగా డైట్ భీమిలి లెక్చరర్ సోమయాజులు, ఉపాధ్యాయులు జరికృష్ణ, రాజకిరణ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సహ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు, స్థానిక పాఠశాల హెచ్ఎం శాంతికుమారి పాల్గొన్నారు.

పెదగాడిలో కూటమి కార్యకర్తల వీరంగం


పెదగాడి గ్రామ సచివాలయంపై కూటమి కార్యకర్తలు రువ్విన రాళ్లు


బీటలు వారిన అంబేడ్కర్ విగ్రహం

- గ్రామ సచివాలయంపై రాళ్లు రువ్విన టీడీపీ,జనసేన కార్యకర్తలు
- డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహంపై కూడా రాళ్లు వేసిన వైనం

పెందుర్తి: పెందుర్తి మండలం పెదగాడిలో మరోసారి టీడీపీ–జనసేన కూటమి కార్యకర్తలు రెచ్చిపోయారు. రెండు రోజుల కిందటే గ్రామ సర్పంచ్‌కు చెందిన ఆస్తులు ధ్వంసం చేసిన ఘటన మరువక ముందే తాజాగా గ్రామ సచివాలయంపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనలో గ్రామ సచివాలయం పాక్షికంగా దెబ్బతింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా పాక్షికంగా ధ్వంసం చేశారు. అనంతరం సచివాలయం ఆవరణలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహంపై కూడా దుండగులు రాళ్లు రువ్వారు. దీంతో అంబేడ్కర్ విగ్రహం స్వల్పంగా బీటలు వారింది. దీనిపై సర్పంచ్ కేసు బోయిన లావణ్య పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన్యంలో భారీ వర్షం


ఎగువబొండాపల్లిలో ఇంటిపై పడిన చెట్టు

పెదబయలు: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. స్థానిక జీసీసీ డిపో సమీపంలో భారీ వృక్షం నేల కూలింది. చెట్టుకొమ్మలు పడటంతో జీసీసీ భవనం పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. అదే ప్రాంతంలో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. స్థానిక స్టేట్ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్న నల్లా సత్యనారాయణ ఇంటి ఎదురుగా పార్కింగ్ చేసి ఉన్న కారుపై టేకు చెట్టు కొమ్మలు విరిగిపడడంతో కారు ధ్వంసం అయింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, స్టేట్ బ్యాంకు ప్రాంతాల్లో కూలిన టేకుచెట్టును స్థానిక పోలీసులు తొలగించారు. అంబేడ్కర్ పార్కు సమీపంలో చెట్టు కూలడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఐటీడీఏ క్వార్టర్ల సమీపంలో విద్యుత్ లైన్‌పై చెట్టు కొమ్మలు పడి వైర్లు తెగిపోయాయి.దీంతో సుమారు 3 గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.బొండాపల్లి పంచాయతీ ఎగువ బొండాపల్లి గ్రామంలో చెట్టు కూలి పలాసి పండన్న ఇల్లు ధ్వంసమైంది. పెదబయలు లైబ్రరీ వీధిలో సీసీరోడ్డుపై చేరిన వరదనీరు చెరువును తలపించింది.

వైద్యాధికారి పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఓఎస్ థెరపీ కేంద్రంలో కాంట్రాక్టు విధానంలో వైద్యాధికారి పోస్టు భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీలోగా తమ దరకాస్తులను ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

కలలు.. ఆశలు.. ఆనందాలు.. హర్టయ్యే సందర్భాలు.. పాఠాలు.. దుమ్ములు.. అన్నీ కొత్తగా అనిపించేవే. అప్పటి వరకు పాఠశాల చదువు.. ఒక్కసారిగా కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం. ఈ క్రమంలో కొత్త పరిసరాలు.. కొత్త వారితో పరిచయాలు, సరికొత్త ఆలోచనలు.. ఇప్పుడిప్పుడే కళాశాలలో అడుగుపెట్టే విద్యార్థికి ఇలా అన్నీ కొత్తగా.. వింతగా అనిపిస్తాయి. టీనేజ్‌లో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకం. అంతే కాదు జీవితాన్ని మలుపు తిప్పాలన్నా ఇదే ముఖ్యమైన కాలం. అన్నీ తెలిసినట్టే అనిపిస్తుంది. కానీ ఏమీ తెలియని తనం ఆవహిస్తుంది. ఈ రెండింటి మధ్య తేడాను తెలుసుకుంటే జీవితం విజయం వైపు పయనిస్తుంది. కొత్త బంగారులోకం అవుతుంది. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా.. జీవితం మన చేతుల్లోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నడుస్తుంది. – విశాఖ విద్య

కొత్త ప్రపంచం.. బంగారు జీవితం

- ఇంటర్‌లో కౌమార దశ
- గాడి తప్పితే జీవితమే గందరగోళం
- చెడు వ్యసనాలను దరి చేరనీయకూడదు
- క్రమశిక్షణతో సాగితే విజయం ఖాయం

తొలిసారి ఎదుర్కొన్న పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించామన్న ఆత్మ విశ్వాసం, పాఠశాలను దాటి కళాశాలను చేరామన్న ఉత్సాహం..కొత్త పరిచయాలు, కళాశాల వాతావరణం కలిగించే ఆనందం వెరసి విద్యార్థులకు కళాశాల దశ కొత్త అనుభూతిని అందిస్తుంది. అనువైన గ్రూపు.. ఇష్టమైన సబ్జెక్టులు చదివే తొలి స్వేచ్ఛా దశ ఇదని చెప్పవచ్చు. జీవితంలో కీలక అడుగులన్నీ ఇంటర్‌లోనే పడతాయనడంలో అతిశయోక్తి లేదు. ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలు సాధించినా.. గాడి తప్పి అథః పాతాళానికి పడిపోయినా ఇక్కడే బీజాలు పడతాయి. హైస్కూల్ విద్యతో మొదలయ్యే కౌమార ప్రాయం ఇంటర్‌లో మరింత పురి విప్పుతుంది. అందుకే ఈ దశ చాలా కీలకం.

స్నేహం.. మధురం

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ అది ఉన్నత భావాలున్న వారితో కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది. పశ్చాత్తాపం పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, పెద్దలపై గౌరవం, సమాజం మీద అవగాహన, అధ్యాపకులపై సదాభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంలోనే ముందుకు సాగాలి.

చదువుకే తొలి ప్రాధాన్యం : ఇంటర్ విద్యార్థులు ఎన్నో అంశాలకు ఆకర్షితులవుతారు. అయితే ఈ దశలో అందరికీ తొలి ప్రాధాన్యం చదువే కావాలి. జీవితంలో అల్లరి పాలయ్యేలా అల్లరి ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలకు దుమ్మా కొట్టడం, హీరోయిజం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావడం, పాఠ్యాంశాలపై దృష్టి పెట్టడం, అధ్యాపకులిచ్చే నోట్స్‌ను ఎప్పటికప్పుడు నీట్‌గా రాసుకోవడం, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవడం, స్నేహితులతో కలిసి కంబైన్డ్ స్టడీ చేయడం వంటివి ఉపయుక్తంగా నిలుస్తాయి.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ(ఫైల్)

సమయం విలువైనది

ఇంటర్‌లో సెలవు దినాలంటే విద్యార్థులకు పండగే. అయితే వాటిని సద్వినియోగం చేసుకోగలిగితే విద్యార్థి ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించగలడు. ఆయా సమయాల్లో వారు ఎంచుకునే వ్యాపకాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయి. మనసును, శరీరాన్ని ఉల్లాసపర్చే మంచి క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం వంటివి ఆహ్లాదంతో పాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి. సివిల్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, సాఫ్ట్‌వేర్ వంటి ఏ కోర్సుకైనా తొలి అడుగు పడాల్సింది ఇంటర్‌లోనే.

వ్యసనాలకు దూరం

జీవితాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యసనాలు ఈ దశలోనే అలవాటయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటి నుంచి తప్పించుకోవాలి. సిగరెట్, గుట్కాలు, మద్యం వంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మేలు. ముఖ్యంగా సెల్‌ఫోన్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. తరగతి గదుల్లో.. చదువుకునే వేళల్లో అనవసరమైన కబుర్లకు అలవాటు పడేలా చేస్తాయి. పరిచిత, అపరిచిత వ్యక్తులతో చాటింగ్ మోజులో పడొద్దు. నెట్ అలవాటు విషయంలోను విద్యార్థులకు జాగ్రత్త అవసరం. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావంతో, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోవద్దు. దారి తప్పి భావి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. స్నేహితులే లోకంగా అనిపించే వయసులో వారికి అతి ప్రాధాన్యం ఇస్తూ తల్లిదండ్రుల, అధ్యాపకులను నిర్లక్ష్యం చేయకూడదు. తల్లిదండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దు.

కాలేజీల్లో కమిటీల ఏర్పాటు



విద్యా సంవత్సరం ప్రారంభమైనందున అకడమిక్ క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చాం. బాలబాలికల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారు చదువులపైనే శ్రద్ధ చూపేలా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. ఇంటర్మీడియట్ ప్రాధాన్యం దృష్ట్యా విద్యార్థులు సత్ప్రవర్తనతో చదువులపైనే దృష్టి పెట్టి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి. –పి.మురళీధర్, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి



పదో తరగతి చదివి ఇంటర్‌లోకి రాగానే ఏదో లోకంలో విహరిస్తారు. విద్యార్థుల్లో ఇది ఎంతమాత్రం సరైంది కాదు. ఇంటర్మీడియట్‌లో బాగా చదువుకుంటే ఉన్నత చదువుల్లో నచ్చిన రంగం వైపు పయనించవచ్చు. షికార్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. కాలేజీలకు వెళ్లిన తమ పిల్లల చదువులు ఎలా ఉన్నాయనేది తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణ చేయాలి. మా విద్యా సంస్థల్లో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కౌన్సిలర్లను ఏర్పాటు చేశాం. – కె.వి. మణ, శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం, విశాఖ

చదువుకుంటేనే భవిష్యత్



విద్యార్థులు బాగా చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుంది. ఇదే విషయాన్ని మా విద్యార్థులకు చెబుతున్నాం. కాలేజీ అంటే అదో లోకం అనే ధోరణి వీడాలి. విద్యార్థులు చదువులపైనే శ్రద్ధ వహించాలి. ఈ విషయంలో విద్యార్థులకు మా వంతుగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచిస్తున్నాం. చదువు విలువ తెలుసుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. – బి.స్వాతి, కౌన్సిలర్, కేజీబీవీ, ఆనందపురం

కలలను సాకారం చేసుకోవాలి



ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకం. దీనిపై శ్రద్ధ వహించే వారు తమ కలలను సునాయాసంగా సాకారం చేసుకోవచ్చు. చదువుతో ఏదైనా సాధ్యమే. కాలేజీలకు వచ్చేశామని మితిమీరిన స్వేచ్ఛ వద్దు. కాలేజీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, నేరుగా అధ్యాపకులతో చెప్పుకోవచ్చు. విద్యార్థులకు అండగా నిలిచేలా ప్రభుత్వ కాలేజీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. –బి.రాధ, డీవీఈవో, విశాఖ

175 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎంవీపీకాలనీ: అక్రమంగా తరలిస్తున్న 175 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం ఎంవీపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులు వెంకోజీపాలెం కూడలి వద్ద నాలుగు వాహనాలను ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. పూర్ణామార్కెట్‌కు చెందిన వాడబోయిన అప్పలరాజు, దొడ్డి రాజు, జ్ఞానాపురానికి చెందిన కొక్కిన రమణ, నాయిన సన్యాసిరావు ఈ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేయడంతో పాటు వివరాలు సేకరించి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సివిల్ సప్లై ఆర్‌ఐతో కలిసి పోలీసులు వాహనాలను, బియ్యాన్ని సీజ్ చేశారు.

240 మద్యం బాటిళ్ల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు..

సీతమ్మధార: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి సమీపంలోని ఓ ఇంట్లో అక్రమంగా మద్యం బాటిళ్లు ఉన్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సోదాలు చేశారు. ఆ ఇంట్లో ఉన్న చెన్నైకు చెందిన తిరుపతిరావును అదుపులోకి తీసుకుని.. అతని వద్ద నుంచి సుమారు 240 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటు మద్యాన్ని ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





చిత్రకళ.. అదిరేలా!

శివాజీపాలెంలోని ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శన మైమరపించింది. బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థులు చివరి సంవత్సరంలో తమ కోర్సులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ప్రారంభించారు. ఎంతో సృజనాత్మకంగా.. వైవిధ్యమైన సామగ్రిని వినియోగిస్తూ విద్యార్థులు తీర్చిదిద్దిన శిల్పాలు, చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. సమాజంలోని విభిన్న అంశాలను స్పృశిస్తూ విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు ఎంతగానో ఆలోచింపజేశాయి. ఈ చిత్రకళా ప్రదర్శనను పలువురు తిలకించి.. విద్యార్థుల కష్టాన్ని, కృషిని ప్రశంసించారు. – ఏయూక్యాంపస్




చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్


విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, పెయింటింగ్‌లు

కంటైనర్ ఢీకొని కాంట్రాక్ట్ కార్మికుడి దుర్మరణం

మల్కాపురం: ద్విచక్ర వాహనంపై వస్తున్న ఒకరిని కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. గాజువాక సమీపంలోని వడ్లపూడి క్రాంతికాలనీ ప్రాంతానికి చెందిన వెలగ నందికుమార్(42) ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన ఇంటి నుంచి షీలానగర్ మీదుగా మారుతి సర్కిల్ వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. అదే సమయంలో అదే మార్గంలో వేగంగా వస్తున్న కంటైనర్ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో నందికుమార్ శరీరం నుజ్జు నుజ్జు అయ్యింది. మల్కాపురం పోలీసులు సమాచారం తెలుసుకుని.. అక్కడకు వెళ్లి ప్రమాదంపై వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ అప్పలనాయుడుని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నందికుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మల్కాపురం సీఐ సనావుల్లా ఆధ్వర్యంలో ఎస్ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి

- బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గోపాలపట్నంలో ఘటన
- మృతుడు విజయనగరం జిల్లా కుమిలి వాసిగా గుర్తింపు


వసంత్(ఫైల్)

గోపాలపట్నం: గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే అండర్ పాస్‌వే సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందాడు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ సమీప కుమిలి గ్రామానికి చెందిన కర్రి వసంత్ కుమార్(19) ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిషిప్ చేసేందుకు విశాఖ వచ్చాడు. కొత్తపాలెంలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేశాక బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు శుక్రవారం ఉదయం చుట్టూ పక్కల వెతికినా ఫలితం లేకపోయింది. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడి ఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారమందించారు. కొద్ది రోజులుగా బంధువుల ఇంటి వద్దే ఉంటున్నాడు. వసంత్‌కుమార్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి జీఆర్‌పీ ఎస్ఐ బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలేరు కాలువకు లీకేజీ


చినగొలుగొండపేట వద్ద డ్రైనేజీలో చేరుతున్న లీకేజీ నీరు


ఏలేరు కాలువ

- వృథాగా నీరు పోవడంతో స్టీల్‌ప్లాంట్‌కు తగ్గిన సరఫరా

నాతవరం: కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తరలిస్తున్న కాలువ నీరు లీకేజీలతో వృథాగా పోతోంది. నాతవరం మండలం పెదగొలుగొండపేట సమీపంలో 66 కిలోమీటరు వద్ద నిత్యం నీరు వృథాగా పోతున్నా, అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. 1989లో ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో 154 కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నాతవరం మండలం పి.జగ్గంపేట, కె.ధర్మవరం, పి.కె.గూడెం, గునుపూడి, పెదగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, లింగంపేట, మన్యపురట్ల, ఉప్పరగూడెం, ఎ.పి.పురం, ఎం.బి.పట్నం, ఎ.శరభవరం, లక్ష్మీపురం, వెంకయ్యపాలెం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం గ్రామాల మీదుగా 26 కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తోంది. ఇందులో గునుపూడి, చినగొలుగొండపేట, ఉప్పరగూడెం, మన్యపురట్ల, ఎ.శరభవరం ప్రాంతాల్లో ఏలేరు కాలువ పలు చోట్ల లీకేజీకి గురై నీరు పోతోంది. ఈ విధంగా పోవడం వల్ల విశాఖ స్టీల్ ప్లాంటుకు సరఫరా అవుతున్న నీరు గణనీయంగా తగ్గుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంటుతోపాటు ఇతర పరిశ్రమలు, విశాఖ నగర ప్రజలకు తాగునీటి కోసం ఏలేరు కాలువ ద్వారా రోజు ఒక్కంటి 150పైగా క్యూసెక్కులు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో తుపాన్లు సంభవించినప్పుడు భారీ వర్షాలకు ఏలేరు కాలువ పలు చోట్ల దెబ్బతింటోంది. ఆ సమయంలో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడం వల్ల అనేక చోట్ల మరమ్మతులకు గురై లీకేజీ అవుతోంది. ఇప్పటికైనా కాలువకు సిమెంటు లైనింగ్ చేస్తే లీకేజీ సమస్య తప్పుతుందని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి లైన్‌మన్ మృతి

సింహాచలం/గోపాలపట్నం: విద్యుత్ స్తంభంపై నుంచి పడి లైన్‌మన్ మృతి చెందిన ఘటన 98వ వార్డు అప్పన్నపాలెంలోని సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గోపాలపట్నం దరి కొత్తపాలేనికి చెందిన పాలమరశెట్టి వెంకటరమణ(47) అప్పన్నపాలెం సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం డ్యూటీకి వచ్చాడు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పని మీద విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి కింద ఉన్న ఎర్త్ కుండీల మీద పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. సహచర సిబ్బంది, స్థానికులు గోపాలపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటరమణకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమార్తెకి వివాహం జరిగింది. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకట రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఆయన మృతితో కొత్తపాలెంలో విషాదచాయలు అలుముకున్నాయి. విద్యుత్ సమస్య ఉంటే వెంటనే స్పందించేవాడని స్థానికులు గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరవుతున్నారు.


వెంకటరమణ(ఫైల్)